సాక్షి అన్నమయ్య జిల్లా

గురువారం । 8 । ఫిబ్రవరి । 2024



మదనపల్లెలో కేంద్రీయ విద్యాలయం

మదనపల్లెలో కేంద్రీయ విద్యాలయం ప్రారంభానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. అందులో భాగంగా బుధవారం కేంద్ర బృందం మదనపల్లెకు వచ్చి పరిశీలించింది. -8లో



దిగుబడి ఘనం..ధరలు అమోఘం

ఉలవసాగుపై ఆశలు పెట్టుకొన్న రైతులకు ఈ ఏడాది మంచి లాభాలు వచ్చాయి. సకాలంలో వర్షాలు కురవడంతో ఎకరానికి 7 నుంచి 8 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.250	రూ.320
రెండోరకం	రూ.150	రూ.248



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 93 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	365	525
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 1,949.040 కిలోలు

న్యూస్‌రీల్

కలెక్టరేట్ ఏఓగా బాలాజీరాజ్



రాయచోటి: అన్నమయ్య జిల్లా కలెక్టరేట్ ఏఓగా ఆర్.బాలాజీరాజ్ బుధవారం కలెక్టరేట్ ఇన్‌చార్జ్ ఏఓ నాగభూషణం నుంచి బాలాజీరాజ్ బాధ్యతలు చేపట్టారు. అనంతపురం జిల్లా కలెక్టరేట్ ఏఓగా ఉంటూ ఎన్నికల బదిలీలలో భాగంగా అన్నమయ్య జిల్లాకు బాలాజీరాజ్ బదిలీపై వచ్చారు. స్థానికంగా పనిచేస్తున్న ఏఓ బాలకృష్ణ డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతిపై బదిలీ అయిన సంగతి తెలిసిందే.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి



డీఈవో నుంచి జిల్లా కో ఆర్డినేటర్‌గా నియామక పత్రాన్ని తీసుకొంటున్న కొండూరు శ్రీనివాసరాజు

రాయచోటి టౌన్: బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం తన వంతు కృషి చేస్తానని జిల్లా ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్‌గా ఎంపికైన కొండూరు శ్రీనివాస రాజు అన్నారు. రాయచోటి డైట్ స్కూల్లో సైన్స్ స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఆయనను బుధవారం అన్నమయ్య జిల్లా ఓపెన్‌స్కూల్ కో ఆర్డినేటర్‌గా నియమిస్తూ రాష్ట్ర విద్యాశాఖ నుంచి ఆదేశాలు వచ్చాయి. ఈ మేరకు డీఈవో శ్రీరాం పురుషోత్తం నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన బడిబయటి పిల్లలను గుర్తించి వారిని ఓపెన్ స్కూల్లో చేర్పించాలని, అలాగే నిరక్షరాస్యతను లేకుండా చేయాలని సూచించారు.

భాకరాపేటలో స్టాపింగ్

కడప కోటిరెడ్డిసర్కిల్: కడప–తిరుపతి మధ్య నడుస్తున్న నాన్ స్టాప్ బస్ సర్వీసుకు భాకరాపేటలో స్టేజీ ఏర్పాటు చేశామని కడప డిపో మేనేజర్ ఢిల్లీశ్వరరావు తెలిపారు. ఈ నాన్ స్టాప్ సర్వీసులకు టిక్కెట్ ఇచ్చేందుకు కండక్టర్ అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈ అవకాశాన్ని భాకరాపేట ప్రయాణీకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

11న దళిత సింహగర్జన

కడప రూరల్: దళితులపై జరుగుతున్న దాడులకు నిరసనగా ఈ నెల 11వ తేదీన రాజమండ్రిలో నిర్వహించే దళిత సింహ గర్జన సభను జయప్రదం చేయాలని మాజీ పార్లమెంట్ సభ్యులు హర్షకుమార్ అన్నారు. కడపలోని ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్‌లో బుధవారం ఆయన పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ దళితులపై పెత్తందార్లు దాడులకు తెగపడుతున్నారని తెలిపారు. ఇందుకు నిరసనగా ఈ నెల 11వ తేదీన రాజమండ్రిలో నిర్వహించే దళిత సింహ గర్జన సభను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో విజయ్, వినోద్, ఆర్ఎస్ రాజ, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ గీతిక..ప్రగతి దీపిక

- ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో ప్రభుత్వ నిర్దేశం
- రాజంపేటకు అన్నమాచార్య యూనివర్సిటీ
- వైఎస్సార్–ఈఎంసీలో రూ.450 కోట్లపెట్టుబడులు
- రైతు భరోసా ద్వారా జిల్లాకు రూ.283కోట్ల లబ్ధి
- బడ్జెట్‌పై సర్వత్రా హర్షం



సాక్షి ప్రతినిధి, కడప: సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లులా, సామాజిక సమతుల్యత ప్రామాణికంగా రాష్ట్ర ప్రభుత్వం ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను రూపొందించింది. బడుగులకు సంక్షేమ పథకాల కొనసాగిస్తూనే, మహిళలను మహారాణులుగా, రైతులకు భూభద్రత కల్పన, భరోసా, సుపరిపాలన అందించడమే లక్ష్యంగా బడ్జెట్ కేటాయింపులు చేసింది. 2024–25 ఆర్థిక సంవత్సరానికి రూ.2,86,389 కోట్ల ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను శాసనసభలో ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథరెడ్డి బుధవారం ప్రవేశపెట్టారు. రాష్ట్రంలో వైఎస్సార్ పెన్షన్ కానుక, రైతు భరోసా, విద్యా దీవెన, వసతి దీవెన, ఉచిత వడ్డీ రుణాలు, వైఎస్సార్ వడ్డీ రహిత రైతు రుణాలు, కాపు నేస్తం, జగనన్న చేదోడు, మైనార్టీల సంక్షేమం, కాపు నేస్తం, అగ్రవర్ణ పేదల ఉన్నతి, వైఎస్సార్ వాహన మిత్ర, నేతన్ననేస్తం, మత్స్యకార భరోసా తదితర సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు కేటాయింపులు కొనసాగించింది.

పరిశ్రమల పట్ల ప్రత్యేక చొరవ

రాష్ట్రంలో పెట్టుబడులను ప్రోత్సహించి పెద్ద ఎత్తున ఉపాధి కల్పించడం కోసం ప్రభుత్వం ఎలక్ట్రానిక్స్ మ్యాన్‌ఫ్యాక్చరింగ్ పాలసీ తీసుకువచ్చింది. కొప్పర్తి కేంద్రంగా ఏర్పాటు చేసిన వైఎస్సార్–ఈఎంసీ పథకంలో 500 ఎకరాలల్లో మౌలిక వసతులు కలిపించారు. 2023 జూలైలో చేపట్టిన ఎంఓయూ ద్వారా రూ.450 కోట్లు పెట్టుబడులతో 6,300 మందికి ప్రత్యక్ష ఉద్యోగ అవకాశాలను కల్పించనుంది. జేఎస్‌డబ్ల్యూ ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు కావాల్సిన మౌలిక వసతులు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంది.

రాజంపేటలో అన్నమాచార్య యూనివర్సిటీ

రాజంపేట కేంద్రంగా అన్నమాచార్య యూనివర్సిటీ ఏర్పాటుకు ప్రభుత్వం అమోదించింది. ఇప్పటికే వైఎస్సార్ జిల్లా కేంద్రంగా యోగి వేమన విశ్వ విద్యాలయం, వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైనార్ట్స్ యూనివర్సిటీ ఉన్నాయి. తాజాగా అన్నమాచార్య యూనివర్సిటీ అందుబాటులోకి రానుంది. రాష్ట్ర వ్యాప్తంగా 9,52,925 మందికి ఉచితంగా ట్యాబ్స్ అందిస్తోంది. వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లో దాదాపు 35వేల మంది విద్యార్థులకు ట్యాబ్స్ దక్కనున్నాయి. అలాగే రైతు భరోసా రూపేణా అన్నదాతలకు రూ.283 కోట్లు వైఎస్సార్ జిల్లాలోని 2.11లక్షల మంది రైతులకు దక్కనుంది. 70వేల మందికి సున్నా వడ్డీ రాయితీ ద్వారా మరో రూ.25కోట్లు లభించనుంది. రైతు భూభద్రత కోసం సంపూర్ణ రీసర్వే చేపట్టేందుకు కృత నిశ్చయంతో ఉంది. ఆంధ్రప్రదేశ్‌లోని మహిళలను మహారాణులుగా చేయాలన్నదే లక్ష్యంతో ప్రభుత్వం వ్యవహారిస్తోంది.

జనాకర్షక బడ్జెట్



ఆంధ్రప్రదేశ్‌లో 2024–25 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ జనాకర్షకంగా ఉంది. ఏప్రిల్ నుంచి జూలై నెల వరకే బడ్జెట్ ప్రవేశపెట్టినప్పటికీ బలహీన వర్గాల సంక్షేమానికి, వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తూనే రాష్ట్రంలోని సమస్యల పరిష్కారానికి చొరవ ప్రదర్శించారు. వికేంద్రీకరణ ద్వారా ప్రజలకు సేవలందించేందుకు నిర్ణయించడం సంతోషదాయకం.

– కె. సురేష్ బాబు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు

పారిశ్రామికాభివృద్ధికి దోహదం



రాష్ట్ర విభజన అనంతరం పారిశ్రామిక రంగం అభివృద్ధికి దోహదం చేసే చర్యలు చేపట్టారు. ముఖ్యంగా ఓడరేవుల అభివృద్ధికి రూ.20వేల కోట్లు కేటాయించడం అభినందనీయం. ఓడరేవుల ఆధారిత పారిశ్రామిక నిర్మాణం, అభివృద్ధి కీలకంగా భావించి బడ్జెట్‌లో ప్రాధాన్యత ఇచ్చారు. పెట్టుబడులు సాధించడంలో గణనీయమైన అభివృద్ధి, ఉద్యోగ నియామకాలకు ప్రాధాన్యత ఇవ్వడం ఆహ్వానించదగ్గ పరిణామం. – కె. శివరాం, ఆర్థికశాస్త్ర అధ్యాపకులు, ప్రభుత్వ పురుషుల కళాశాల, కడప

ఆర్థికాభివృద్ధికి దోహదం



ప్రవేశపెట్టిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఓటాన్ అకౌంట్ బడ్జెట్ సంక్షేమానికి స్ఫూర్తిగా నిలిచింది. సంక్షేమ సూచికలైన విద్య, వైద్యమే లక్ష్యంగా బడ్జెట్ ప్రవేపెట్టడం సంతోషకరం. రూ.2,86,389.27 కోట్ల అంచనాతో వ్యవసాయానికి ప్రాధాన్యతను ఇచ్చారు. బడుగు, బలహీ వర్గాల అభివృద్ధి, సంక్షేమం బడ్జెట్‌లో కనిపిస్తోంది. అమర్త్యసేన్ సూత్రమైన సంక్షేమం ద్వారా ఆర్థికాభివృద్ధి పెరుగుదలకు ప్రాధాన్యత ఏర్పడింది.

– కనపర్తి త్రివిక్రమ్ రెడ్డి, ప్రిన్సిపాల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఎర్రగుంట్ల

అన్ని వర్గాల సంక్షేమానికి కృషి



బడ్జెట్‌లో అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత కల్పించింది. విద్యకు, వైద్యానికి ప్రాధాన్యత కల్పించారు. అసెంబ్లీలో రూ.2,30,110 కోట్ల రెవెన్యూ వ్యయం, రూ.30,530 కోట్ల మూలధన వ్యయంతో పద్దును ప్రతిపాదించారు.

– డాక్టర్ మూలె రామమునిరెడ్డి, విశ్రాంత తెలుగు పండితుడు ప్రొద్దుటూరు

వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత



ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ సంక్షేమ రంగానికి పెద్దపీట వేసింది.వెనుకబడిన వర్గాల సంక్షేమానికి రూ.71,740 కోట్లు కేటాయించడం ద్వారా వారికి ప్రభుత్వం ఇచ్చే ప్రాధాన్యతను చాటిచెప్పారు. వ్యవసాయరంగం, విద్యారంగానికి పెద్దపీట వేశారు.

-ఎం. గురుమోహన్‌రెడ్డి, ఆర్థికశాఖ సహాయ ఆచార్యులు, ఎస్‌కేఆర్,ఎస్‌కేఆర్ కళాశాల, కడప

అందరికీ ఉపయుక్తమైన బడ్జెట్



బడ్జెట్‌లో ప్రభుత్వం వ్యవసాయం, సంక్షేమానికి పెద్దపీట వేసింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షపాతి, ఇదే క్రమంలో రైతుల సంక్షేమానికి పెద్దపీట వేశారు. గత ఐదేళ్లలో ప్రభుత్వం ప్రజలకు మంచి చేసింది. ఈ బడ్జెట్ వలన రాష్ట్రంలోని అన్ని వర్గాలకు ఉపయుక్తంగా ఉంది. –తెలిదేల లక్ష్మయ్య, మండల అధ్యక్షులు, చాపాడు మండలం

జనరంజకంగా ఉంది



ఏపీ ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ జనరంజకంగా ఉంది. విద్య, వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇచ్చారు. ఏ వర్గాన్ని విస్మరించకుండా బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. అన్నమయ్య జిల్లా రాజంపేట అన్నమాచార్య యూనివర్శిటీ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం శుభపరిణామం -బి. శంకర్ నాయక్, ఎంబీఏ హెచ్ఓడీ, కురబలకోట మండలం

బీసీ సంక్షేమానికి పెద్దపీట



ప్రభుత్వం ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో బీసీ సంక్షేమానికి ఏకంగా రూ.71,740 కోట్లు కేటాయించడం రాష్ట్ర చరిత్రలోనే రికార్డు. బీసీల కోసం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటుచేసిన 56 కార్పొరేషన్లకు ప్రభుత్వం పెద్ద మొత్తంలో నిధులు కేటాయించడం అభినందనీయం.

– జబ్బలశ్రీనివాసులు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం సౌత్ఇండియా అధ్యక్షులు

పోలింగ్ కేంద్రాల నిర్వహణలో నిర్లక్ష్యం తగదు

జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్

పీలేరు: పోలింగ్ కేంద్రాల నిర్వహణలో నిర్లక్ష్యం వహించరాదని జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ అన్నారు. బుధవారం మండలంలోని కోటపల్లెలోని మండల పరిషత్ పాఠశాల, పీలేరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల కమిషన్ ఇచ్చిన లేఅవుట్ ప్రకారం అన్ని సౌకర్యాలు ఉండేలా చూసుకోవాలన్నారు. ఎన్నికల విధులకు కేటాయించిన సిబ్బందిలో ఖాళీలు లేకుండా చూసుకోవాలని ఆర్డీవో, తహసీల్దార్‌లను ఆదేశించారు. ఎన్నికల నిర్వహణపై బీఎల్‌వోలకు పూర్తి స్థాయి అవగాహన ఉండాలన్నారు. ఎన్నికల విధుల్లో బీఎల్‌వోల పాత్ర చాలా కీలకమైందని తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్తు, తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ఎన్నికల సమయంలో పటిష్ట బందోబస్తు కల్పించాలని పోలీసు సిబ్బందిని ఆదేశించారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రశాంత వాతావరణం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రంగస్వామి, తహసీల్దార్ మహబూబ్‌బాషా, సర్వేయర్లు, సెక్టోరియల్ అధికారులు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ అభిషిక్త్ కిషోర్

యాత్ర-2 పోస్టర్లు ఆవిష్కరణ

కడప కార్పొరేషన్: దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జీవిత చరిత్ర ఆధారంగా తెరకెక్కించిన యాత్ర -2 సినిమా పోస్టర్లను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, టీటీడీ బోర్డు సభ్యుడు ఎస్.యానాదయ్య, హరూన్ గ్రూప్స్ మేనేజింగ్ డైరెక్టర్ అహ్మద్‌బాషాలు బుధవారం కడపలో ఆవిష్కరించారు. అనంతరం స్కూటర్ ర్యాలీ నిర్వహించారు. పార్టీ నాయకులు ఎస్. సుబ్బారెడ్డి, సీహెచ్ వినోద్, ఎ.బాలక్రిష్టారెడ్డి, ఆర్‌వీ రమణ, కె.బాబు, కిరణ్ పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సీమ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా అంకన్న



వైవీయూ: కర్నూలు రాయలసీమ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా యోగివేమన విశ్వ విద్యాలయం ఆంగ్లశాఖ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ నాగుల అంకన్న నియమితులయ్యారు. మైలవరం మండలం భోగాలకట్ట గ్రామానికి చెందిన ఈయన పాఠశాల విద్య జమ్మలమడుగులోను, డిగ్రీ అనంతపురం ప్రభుత్వ కళాశాలలోను, ఎంఏ, ఎంఫిల్, పీహెచ్‌డీ తిరుపతి ఎస్వీయూలో పూర్తి చేశారు. అనంతరం 2009లో వైవీయూ ఆంగ్లశాఖలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియమితులయ్యారు. 2021లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందారు. కాగా ఈయన గతంలో డిప్యూటీ వార్డెన్‌గా, కాంపిటీటివ్ సెల్ డైరెక్టర్‌గా, ప్రవేశాల విభాగం సభ్యుడిగా, ఎగ్జామినేషన్ బ్రాంచ్ అసిస్టెంట్ చీఫ్ సూపరింటెండెంట్‌గా పలు పరిపాలనమైన విధులను నిర్వహించారు.


నేటి నుంచి పీజీ పరీక్షలు

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం పోస్టు గ్రాడ్యుయేషన్ కళాశాల, అనుబంధ కళాశాలల ఎంఏ, ఎంకాం, ఎంఎస్సీ, ఎంపీఈడీ ప్రథమ సెమిస్టర్ పీజీ పరీక్షలు ఈనెల 8వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎన్. ఈశ్వరరెడ్డి తెలిపారు. 8, 12, 14, 16, 19, 21 తేదీలలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు హాల్‌టికెట్‌లతో నిర్ణీత సమయానికి పరీక్షలకు హాజరుకావాలని సూచించారు.

పక్కాగా.. పారదర్శకంగా



ఈమె పేరు రమణమ్మ.పెద్దతిప్పసముద్రం మండలం బూర్లపల్లి హరిజనవాడకు చెందిన ఈమె కూలీ పనులపైనే ఆధారపడి జీవిస్తోంది. గత టీడీపీ ప్రభుత్వంలో సొంతింటి కోసం ఎన్ని వినతులు ఇచ్చినా బుట్టదాఖలైంది. సొంతింటి కల కలగానే మిగిలిపోతుందని నిరాశతో ఉన్న రమణమ్మకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం భరోసా ఇచ్చింది. ఇంటికోసం ఎవరి వద్దకు వెళ్లలేదు. అర్జీలు పెట్టలేదు. వలంటీర్ ఇంటికే వచ్చి వివరాలు నమోదుచేసుకునికి వెళ్లగా అర్హత ఉందని గుర్తించిన ప్రభుత్వం ఇంటి స్థలం ఇచ్చింది. పక్కా గృహం మంజూరు చేసింది. ఇప్పుడు ఇంటి స్థలానికి సచివాలయంలో ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి ఇంటి హక్కు పత్రం అందజేశారు. సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సొంతింటి కలను నెరవేర్చారు. ఆయనకు రుణపడి ఉంటామని రమణమ్మ కుటుంబం చెబుతోంది.



ఈమె పేరు సల్మా. కురబలకోట. టైలర్ వృత్తిపై ఆధారపడి జీవిస్తోంది. భర్త పెయింటర్ పని చేస్తున్నారు. వీరికి సొంతిల్లు లేకపోవడంతో 15 ఏళ్లగా అద్దె ఇంటిలో నివాసం ఉంటున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఇంటికోసం వినతులు ఇచ్చినా లాభం లేకపోయింది. వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక ఇంటిస్థలం కేటాయించాక, పక్కా గృహం మంజూరు చేశారు. జాతీయరహదారి పక్కన విలువైన స్థలాన్ని ఇచ్చారు. ఈస్థలంలో ఇంటి నిర్మాణం చేసుకుంటున్నారు. అద్దెఇంటిలో ఉంటూ ఇబ్బంది పడుతున్న మాకు స్థలం, ఇంటిని మంజూరు చేసిన సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి స్థలానికి ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి ఇస్తున్నారు. ఇలా ఏ ప్రభుత్వంలోనూ జరగలేదు. మాకు న్యాయం చేసిన ప్రభుత్వానికి రుణపడి ఉంటామంటోంది సల్మా.

- సచివాలయాల్లో ఇళ్ల స్థలాలకు ముమ్మరంగా రిజిస్ట్రేషన్లు
- జగనన్న లేఔట్లలో 48,926 మంది పేదలకు ఇంటి నివేశ స్థలాల కేటాయింపు
- అక్కచెల్లెమ్మల పేరిట ఆస్తిని అందిస్తున్న ఏకైక ప్రభుత్వం



బి.కొత్తకోటలో పట్టాలకు రిజిస్ట్రేషన్లు చేస్తున్న వార్డు సచివాలయ సిబ్బంది

నియోజకవర్గాల వారీగా మంజూరు చేసిన పట్టాలు

రాజంపేట	: 6,826
కోడూరు	: 3,951
రాయచోటి	: 10,180
తంబళ్లపల్లె	: 6,424
పీలేరు	: 9,605
మదనపల్లె	: 11,840

బి.కొత్తకోట: గత ప్రభుత్వాల్లో పేదలకు ఇళ్లస్థలాలు కేటాయించడం ఆనవాయితీగా జరిగింది. ముద్రించబడిన కాగితంపై ఫొటో, అధికారి సంతకంతో స్థలాలను మంజూరు చేయడం జరుగుతూ వచ్చింది. బట్ జస్ట్ ఫర్ ఏ చేంజ్ అన్నట్టు వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం మొదటిసారిగా గత ప్రభుత్వాలకు పూర్తి భిన్నంగా ప్రత్యేకంగా స్థలాల కేటాయింపు ప్రక్రియ చేపట్టగా లక్షల విలువైన ఇంటిస్థలాలకు రిజిస్ట్రేషన్ చేయించే చివరి అంకం నిర్విఘ్నంగా సాగుతోంది.

- గత ప్రభుత్వాలు పేదలకు మంజూరు చేసిన ఇంటి నివేశ స్థలాలను ప్రిటింగ్ కాగితంపై ఇంటి పట్టాగా తహసీల్దార్ సంతకంతో జారీ చేయడం జరిగేది. పేదలు కాగితంపై దరఖాస్తు చేసుకుంటే రెవెన్యూ సిబ్బంది విచారించి అర్హులను గుర్తించేవారు.. అర్హులను ఎంపిక చేశాక కాగితాన్నే పట్టాగా జారీ చేసేవారు. ఇలా చేయడం ద్వారా బోగస్ పట్టాలు పుట్టుకు రావడం, ఒకరికి ఇచ్చిన స్థలంలో మరోకరు ఇళ్లు నిర్మించుకోవడం, వివాదాలు అధికంగా వచ్చేవి. వీటి పరిష్కారం చేయలేక రెవెన్యూ అధికారులు చేతులెత్తేడం ఇప్పటికి జరుగుతూనే ఉంది.

అక్రమాలకు తావులేకుండా..

వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అక్రమాలకు, తప్పులు, పొరబాట్లకు తావులేకుండా ఇంటిస్థలాల కేటాయింపు చేపట్టారు. పేదలు ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తు చేసుకోవడం మొదలు, పట్టాను చేతికి తీసుకోవడం వరకు అంతా పక్కాగా, పారదర్శకంగా చేస్తున్నారు. దరఖాస్తుదారుడు సచివాలయాల్లో ఇళ్లస్థలాల కోసం దరఖాస్తు చేసుకుంటే వారి మొబైల్ ఫోన్లకు మెసేజ్ రూపంలో సమాచారం వస్తుంది. వీఆర్‌ఓ నుంచి ఆర్ఐ, డీటీ, చివరగా తహసీల్దార్ వరకు ఏస్థాయిలో దరఖాస్తు ఉందో మొబైల్‌కు సమాచారం అందుతుంది. మంజూరయ్యాక దరఖాస్తుదారుని పేరు, వివరాలు, రెవెన్యూ అధికారులు పొందుబర్చాల్సిన వివరాల కాగితాలు, ప్లాటు స్కెచ్, రూ.10 స్టాంప్ పేపర్‌తో పుస్తక రూపంలో పట్టా ముద్రణ జరిగి సంబంధిత తహసీల్దార్ కార్యాలయాలకు చేరుతాయి. వాటిలో స్థల వివరాలు రాశాక తహసీల్దార్ సంతకంతో పట్టాను లబ్ధిదారులకు అందిస్తారు. ఇలా గతంలో ఎప్పుడుకాని ఇంత పారదర్శకంగా ఇంటిస్థలాల మంజూరు ప్రక్రియ సాగలేదు.

48,926 మందికి

జిల్లాలో పేదలకు 76,400 పక్కా గృహాలు మంజూరయ్యాయి. ఇందులో స్థలాలు లేని పేదలకు ప్రభుత్వం జగనన్న కాలనీల్లో పేదలకు ఇంటిస్థలాలను కేటాయించారు. జిల్లాలో ఆరు నియోజకవర్గాల్లో గుర్తించిన 48,926 మంది అర్హులైన పేదలకు 513 లేఔట్లను సిద్ధం చేసి ప్లాట్లను కేటాయించారు. ప్రతి లబ్ధిదారునికి ఒకటిన్నర సెంటు స్థలం మంజూరు చేసి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో కాలనీలు ఏర్పాటు చేశారు. వీటిల్లో ప్రాంతాలను బట్టి స్థల విలువ ఆధారపడి ఉంటుంది. మార్కెట్ విలువ ఆధారంగా కాకుండా బహిరంగ మార్కెట్‌లో విలువను లెక్కిస్తే ఈ స్థలాల విలువ రూ.1,500 కోట్లకు పైమాటే. ప్రభుత్వం ఇంత విలువైన స్థలాలను ఇవ్వడమేకాక వాటిలో ఇంటి నిర్మాణాల కోసం ఒక్కో లబ్ధిదారుని రూ.1.80 లక్షలను ఉచితంగా మంజూరు చేస్తోంది. ఈ విలువలోనే ఇంటి సామగ్రి, సిమెంటును తక్కువ ధరకే నాణ్యమైనవి సరఫరా చేస్తూ అండగా నిలుస్తోంది.

స్థలాలకు రిజిస్ట్రేషన్లు

విలువైన స్థలాలను అక్కచెల్లెమ్మలకు మంజూరుచేసిన ప్రభుత్వం వాటిని తమ సొంత ఆస్తిగా మార్చేలా నిర్ణయించింది. లబ్ధిదారులకు మంజూరు చేసిన పట్టా పుస్తకం ద్వారా రిజిస్ట్రేషన్ల ప్రక్రియను చేపట్టింది. గతంలో పేదలకు ఇచ్చిన స్థలాలకు రిజిస్ట్రేషన్ చేయించిన చరిత్ర ఏ ప్రభుత్వానికి లేదు. లబ్ధిదారులపై పైసా భారం పడ కుండా పూర్తి ఉచితంగా స్థలాలకు రిజిస్ట్రేషన్లు చేయించి అది వారి ఆస్తిగానే ఉండేలా చేసిన ఘనత వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానిదే. తమ స్థలాలను సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు చే యించుకునేందుకు అక్కచెల్లెమ్మలు క్యూ కడుతున్నారు. రిజిస్ట్రేషన్లు అయ్యాక వారి కళ్లల్లో ఆనందం కనిపిస్తోంది. సీఎం జగన్ అన్నలా తమకు ఆస్తిని రాసిచ్చాడని సంబరపడుతున్నారు. జిల్లా లో స్థలాల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ జోరుగా సాగుతోంది.

ఆనందమానందమాయె

- డీఎస్సీ–24 ప్రకటనతో అభ్యర్థుల్లో వెల్లివిరిసిన సంతోషం
- జిల్లాలో 289 పోస్టులు



ఉమ్మడి వైఎస్ఆర్ జిల్లాలో ఖాళీలు

ఎస్‌జీటీ	105
స్కూల్ అసిస్టెంట్	81
టీజీటీ	103
మొత్తం	289



కడప ఎడ్యుకేషన్/వైవీయూ: విద్య మా మొదటి ప్రాధాన్యత అని చాటిచెబుతూ.. రాష్ట్రంలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి జెండా ఊపుతూ మెగా డీఎస్సీ–2024 నోటిఫికేషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం జారీచేసింది. రాష్ట్రవ్యాప్తంగా 6100 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి సంబంధించిన నోటిఫికేషన్‌ను విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ బుధవారం విడుదల చేశారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, కేజీబీవీ తదితర 7 యాజమాన్యాల పరిధిలోని ఖాళీలను భర్తీచేసేందుకు డీఎస్సీ ప్రకటించారు. ఇందులో రాష్ట్రవ్యాప్తంగా 2,299 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు, 2,280 ఎస్‌జీటీ పోస్టులు, 1264 టీజీటీ పోస్టులు, 215 పీజీటీ పోస్టులు ఉన్నాయి. ఉమ్మడి వైఎస్ఆర్ కడప జిల్లాలో సైతం 289 పోస్టులు భర్తీ కానుండటంతో అభ్యర్థుల్లో ఆనందం నెలకొంది. ఏళ్లతరబడి కోర్సులు పూర్తిచేసి డీఎస్సీ కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థుల్లో ఆనందానికి అవధులు లేవు. ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేయడం పట్ల నిరుద్యోగ అభ్యర్థుల్లో సంతోషం నెలకొంది. ఈనెల 8వ తేదీ నుంచి టెట్ ప్రక్రియ, ఈనెల 12వ తేదీన డీఎస్సీ ప్రక్రియ ప్రారంభం కానుంది.

సంతోషంగా ఉంది..



ఉపాధ్యాయ కొలువు సాధించేందుకు సన్నద్ధమవుతున్న మాకు డీఎస్సీ నోటిఫికేషన్ రావడం సంతోషాన్నిచ్చింది. ఇప్పటికే ప్రిపరేషన్ ప్రారంభించాం. షెడ్యూలు కూడా నిర్ణీత సమయంలోనే పూర్తిచేసేలా ఉంది.

– అనిత, డీఎస్సీ అభ్యర్థి, పులివెందుల


ఆంధ్రా సివిల్స్‌కు సన్నద్ధం..



ఆంధ్రా సివిల్స్‌గా భావించే డీఎస్సీ నోటిఫికేషన్‌ను ప్రభుత్వం జారీ చేయడం సంతోషంగా ఉంది. ఉపాధ్యాయ పోస్టు సాధించాలన్న నా కలను ఈ డీఎస్సీ ద్వారా నెరవేర్చుకోవాలని గట్టిగా ప్రయత్నం చేస్తున్నా.

– ప్రియ, డీఎస్సీ అభ్యర్థి, కడప


ప్రిపరేషన్ మొదలెట్టాం..



ప్రభుత్వం చెప్పిన మాట ప్రకారం డీఎస్సీ నోటిఫికేషన్ జారీచేస్తుందన్న నమ్మకంతో ప్రిపరేషన్‌ను ఇప్పటికే ప్రారంభించాం. నోటిఫికేషన్ రావడం సంతోషాన్నిచ్చింది. ఉపాధ్యాయ పోస్టు సాధించడమే లక్ష్యంగా శ్రమిస్తున్నాం.

– వేణుగోపాల్, డీఎస్సీ అభ్యర్థి, మైదుకూరు

శిక్షణ తీసుకుంటున్నాం..



డీఎస్సీలో విజయం సాధించాలంటే ప్రణాళికాబద్ధంగా శ్రమించాల్సి ఉంటుంది. ఇందుకోసం కడపకు వచ్చి శిక్షణ తీసుకుంటున్నాను. ప్రభుత్వం డీఎస్సీ విడుదల చేసి నిరుద్యోగుల్లో ఆశలు నింపాయి.

– కిశోర్, డీఎస్సీ అభ్యర్థి, కోడూరు

క్లుప్తంగా

'మద్యం మత్తులో పురుగు మందు తాగాడు'

మదనపల్లె: మద్యం అతిగా తాగి దిక్కుతోచని స్థితిలో ఓ వ్యక్తి పురుగుమందు తాగిన సంఘటన మంగళవారం రాత్రి మదనపల్లి మండలంలో జరిగింది. కొత్తపల్లి పంచాయతీ బండకింద పల్లెకు చెందిన రంగప్ప కుమారుడు జి.లోకేష్ (40), మంగళవారం రాత్రి మద్యం పూటుగా తాగి ఇంటికి వచ్చాడు. మత్తు అధికం కావడంతో దిక్కుతోచని స్థితిలో ఇంటిలో ఉన్న పురుగుమందు తాగేశాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే బాధితుడిని 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఔట్ పోస్ట్ పోలీసులు ఎందుకు పురుగు మందు తాగావని ప్రశ్నిస్తే, పొరపాటున తాగేశానని ఆత్మహత్య చేసుకునేందుకు కాదని సమాధానం ఇచ్చినట్లు తెలిసింది.

మహిళ ఆత్మహత్య


మృతి చెందిన పవిత్ర

రాయచోటి టౌన్ : అత్తింటి వారి వేధింపులు తాళలేక పవిత్ర అనే మహిళ (25) ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రాయచోటి మండల పరిధిలోని దూళ్లవారిపల్లెకు చెందిన మహేష్ ఆరు సంవత్సరాల క్రితం పవిత్రను వివాహం చేసుకున్నాడు. వీరికి ఒక సంవత్సరం కుమారుడు ఉన్నాడు.

అయితే గత కొన్ని రోజులుగా అదనంగా కట్నం తీసుకురావాలని అత్తింటివారు వేధిస్తుండటంతో ఆమె మనస్తాపానికి గురైంది. ఈ నేపథ్యంలో బుధవారం ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొంది. మృతురాలి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆమె భర్త మహేష్‌ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వివాహిత అదృశ్యం

మదనపల్లె : వివాహిత అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు వన్ టౌన్ సీఐ వలీబాషు తెలిపారు. పట్టణంలోని నక్కలదిన్నెకు చెందిన కృష్ణకుమారి (40) ఆరు సంవత్సరాల క్రితం భర్త చనిపోవడంతో కర్ణాటక నుంచి మదనపల్లెకు వచ్చి తల్లి రెడ్డెమ్మ వద్ద ఉంటోంది. ఈ క్రమంలో రెండు రోజులనుంచి ఆమె కనిపించకుండా పోయింది. పలుచోట్ల ఆచూకీ కోసం ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. దీంతో కృష్ణకుమారి తల్లి రెడ్డెమ్మ బుధవారం వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అగ్ని ప్రమాదం

చిట్వేలి: చిట్వేలి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో బుధవారం షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం జరిగింది. సబ్ రిజిస్ట్రార్ ఎం. శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు కంప్యూటర్ గదిలో షార్ట్ సర్క్యూట్ వల్ల ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. ఈ ఘటనలో కంప్యూటర్ బ్యాటరీలు తదితర వస్తువులన్నీ పూర్తిగా దగ్ధమయ్యాయి. కాగా పక్కనే ఉన్న డాక్యుమెంట్ భద్రపరిచిన గదిలో ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ సుమని ఘటనా స్థలానికి చేరుకుని వివరాలను ఆరా తీశారు.

దిగుబడి ఘనం.. ధరలు అమోఘం!

- ఈ ఏడాది లాభాలు మిగిల్చిన ఉలవసాగు
- అత్యధికంగా ఎకరానికి 7నుంచి 8 క్వింటాళ్ల పంట దిగుబడి
- మార్కెట్లో కిలో ధర రూ.57 నుంచి రూ.60
- కోల్డ్ స్టోరేజీల్లో స్టాకు నిల్వచేస్తున్న వ్యాపారులు
- జిల్లాలో 6250 ఎకరాల్లో పంట సాగు


చేలల్లో ఉలవ పంటను కోసి కుప్పలుగా పోసిన దృశ్యం

గుర్రంకొండ : జిల్లాలో ముఖ్యంగా పడమటి మండలాల్లో వేరుశనగ పంట సాగు అదును దాటిపోయిన తరువాత ప్రత్యామ్నాయ పంటగా ఉలవసాగును ఇక్కడి రైతులు ఎంచుకుంటారు. ఉలవసాగుపై ఆశలు పెట్టుకొన్న రైతులకు ఈ ఏడాది మంచి లాభాలు వచ్చాయి. సకాలంలో వర్షాలు కురవడంతో ఉలవ పంట ఎకరానికి 7 క్వింటాళ్ల నుంచి 8 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. గత రెండేళ్ల సాధారణ పంట దిగుబడితో పోల్చితే 50 శాతం మేరకు అదనంగా పంట దిగుబడి రావడం గమనార్హం. జిల్లాలో ఈ ఏడాది 6250 ఎకరాల్లో ఉలవ పంటను సాగు చేశారు. ప్రస్తుతం మార్కెట్లో కిలో ధర రూ. 57 నుంచి రూ.60 వరకు ధర పలుకుతుండడంతో రైతులు లాభాల బాట పట్టారు. ఉలవలతో గత ఏడాది మంచి లాభాలు గడించడంతో వ్యాపారులు ఈ ఏడాది కోల్డ్ స్టోరేజీల్లో ఉలవలను స్టాకు ఉంచుతున్నారు.

జిల్లాలో 6250 ఎకరాల్లో సాగు

జిల్లాలో ఈ ఏడాది 6250 ఎకరాల్లో ఉలవ పంటను సాగు చేశారు. సాధారణంగా వేరుశనగ పంట సాగు అదును దాటిపోయిన ఈ ప్రాంతం రైతులు ఆగస్టు నెల నుంచి ఉలవసాగుపై దృష్టి సారిస్తారు. సెప్టెంబర్, అక్టోబర్ నెలలో ఉలవపంట సాగు ప్రారంభమవుతుంది. జనవరి, ఫిబ్రవరి నెలల్లో పంట నూర్పుళ్లు ఉంటాయి. దుక్కుల దగ్గర నుంచి ఉలవలు పొలంలో చల్లే వరకు ఒక ఎకరానికి రూ.10వేలు వరకు ఖర్చు వస్తుంది. విత్తనాలు చల్లినప్పటి నుంచి పంట కోత కోసే వరకు ఎలాంటి ఎరువులు, కూలీల ఖర్చు ఉండదు. ఒకేసారి పంట కోత కోసేందుకు మాత్రమే కూలీల ఖర్చు వస్తుంది. సాధారణంగా సాగు ప్రారంభమైన తరువాత రెండు నెలల పాటు సక్రమంగా వర్షాలు కురిస్తే హెక్టారు సాగుకు 4 నుంచి 5 క్వింటాళ్ల ఉలవ దిగుబడి వస్తుంది. మార్కెట్లో మంచి ధరలు ఉంటే రైతు సాగుకు ఖర్చు చేసిన పెట్టుబడి పోను మంచి లాభాలు వస్తాయి.

రెండేళ్లతో పోల్చితే మంచి దిగుబడి

జిల్లాలో ఉలవ పంట సాగు గత రెండేళ్లతో పోల్చితే ఈ ఏడాది మంచి దిగుబడి వచ్చింది. గత రెండేళ్లలో ఎకరానికి 3 నుంచి 5 క్వింటాళ్ల వరకే పంట దిగుబడి వచ్చింది. ఈ ఏడాది అత్యధికంగా ఎకరానికి 7 నుంచి 8 క్వింటాళ్ల వరకు పంట దిగుబడి రావడం విశేషం. పంట సాగు ప్రారంభమైనప్పటి నుంచి అక్టోబర్, నవంబర్ నెలల్లో రెండు నుంచి నాలుగు మార్లు అదును ప్రకారం వర్షాలు కురిశాయి. అయితే ఈ ఏడాది ఇటు ఖరీఫ్‌లోనూ, అటు రబీలో జిల్లాలోని అన్ని మండలాల్లో పంట సాగుకు అనుకూలమైన సమయంలో వర్షాలు సమృద్ధిగా కురవడంతో పంట సాగుకు ఎంతో అనుకూలం ఏర్పడింది. దీంతో సెప్టెంబర్ నెలలో పంట సాగు చేసిన రైతులకు గత ఏడాదితో పోల్చితే 35 శాతం అధికంగా పంట చేతి కందింది. అక్టోబర్ నెలలో సాగు చేసిన రైతులకు 50 శాతం మేరకు అధికంగా పంట దిగుబడి చేతికి వచ్చింది. మార్కెట్లో మంచి ధరలు ఉండడంతో సాగు కోసం ఖర్చు చేసిన పెట్టుబడి పోనూ మంచి లాభాలు రైతులు చవిచూశారు.

మార్కెట్లో కిలో ధర రూ.57 నుంచి రూ.60

ప్రస్తుతం ఉలవ ధరలు మార్కెట్లో కిలో రూ.57 నుంచి రూ.60 వరకు పలుకుతున్నాయి. రెండేళ్లుగా ఉలవ ధర రూ.35 నుంచి రూ.40 వరకే పలికాయి. సాధారణంగా వర్షాలు సక్రమంగా కురవడంతో పంట దిగుబడి బాగుండడంతో ఈ ఏడాది ఎకరానికి 7 నుంచి 8 క్వింటాళ్ల మేరకు ఉలవ దిగుబడి వచ్చింది. ఈ లెక్కన ఎకరానికి రూ.42వేలు నుంచి రూ.48వేలు వరకు రైతుకు ఆదాయం వచ్చింది. సాధారణ దిగుబడి రాబడితో పోల్చితే ఈ ఏడాది ఎకరానికి రూ.30 నుంచి 34 వేల వరకు అదనపు ఆదాయం రైతుకు సమకూరింది. దీంతో ఈ ఏడాది ఉలవ రైతు లాభాల బాట పట్టాడు.

కోల్డ్ స్టోరేజీల్లో స్టాకు ఉంచుతున్న వ్యాపారులు

గత ఏడాది ఉలవ వ్యాపారం మంచి లాభాలు తెచ్చిపెట్టడంతో వ్యాపారులు ఈ ఏడాది ఉలవలను ఎగబడి కొనుగోలు చేస్తున్నారు. పలువురు రైతుల వద్దకే వెళ్లి ఉలవలను కొనుగోలు చేస్తున్నారు. గత ఏడాది రూ.40 నుంచి రూ.45కే వ్యాపారులు రైతుల వద్ద నుంచి కొనుగోలు చేశారు. అప్పట్లో కోల్డ్ స్టోరేజీల్లో ఉలవలను స్టాకు ఉంచారు. సీజన్ ముగిశాక ప్రభుత్వం సబ్సిడీపై రైతులకు ఉలవలను పంపిణీ చేయడం కోసం వ్యాపారుల నుంచి ఉలవలను కొనుగోలు చేసింది. గత ఏడాది ప్రభుత్వం వ్యాపారుల నుంచి కిలో ఉలవలు రూ. 108కు కొనుగోలు చేసింది. దీంతో వ్యాపారులకు కిలో ఉలవలపై రూ. 63 నుంచి 68 వరకు లాభం వచ్చింది. ఉలవ పంట ఇటు రైతులకు, అటు వ్యాపారులకు మంచి లాభాలు తెచ్చి పెడుతోంది.

ఉలవ సాగు లాభాలు తెచ్చింది



ఈ ఏడాది ఉలవ పంటసాగు చేసి లాభ పడ్డాం. నేను రెండు ఎకరాల్లో ఉలవపంట సాగు చేశాను. వర్షాలు సకాలంలో కురవడంతో సాగుకు ఖర్చు చేసిన పెట్టుబడి పోను రూ. 76 లాభం వచ్చింది. నాలుగు నెలల పాటు పడిన కష్టానికి ఫలితం దక్కింది. గత ఏడాదితో పోల్చితే 50 శాతం దిగుబడి ఎక్కువగా వచ్చింది. ఉలవ సాగుతో రెండేళ్ల నష్టాలు భర్తీ అయ్యాయి.

- నరసింహులు, రైతు, ఎన్.కొత్తపల్లె

ధరలు బాగున్నాయి



రెండేళ్ల కంటే ఈ ఏడాది ఉలవ ధరలు బాగున్నాయి. రెండేళ్లుగా సరాసరి కిలో ఉలవ ధర రూ.35 నుంచి 40 వరకు పలికింది. ఈ ఏడాది కిలో ధర రూ. 58 నుంచి రూ.60 వరకు పలుకుతోంది. రెండేళ్లతో పోల్చుకుంటే ఉలవ ధరలు ఒకటిన్నర రెట్లు పెరిగాయి. మూడు ఎకరాల్లో ఉలవ పంట సాగు చేశాను. మంచి లాభాలు వచ్చాయి.

- వెంకటరమణ ముంతలవారిపల్లె

రైలు కింద పడి వృద్ధుడి ఆత్మహత్య

మదనపల్లె : రైలు కిందపడి ఓ వృద్ధుడు (60) ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం మదనపల్లె మండలం లో జరిగింది. కదిరి రైల్వే పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ మహబూబ్ బాషా తెలిపిన మేరకు వివరాలు.. బుధవారం ఉదయం 7:30 గంటలకు తిరుపతి–గుంతకల్ ప్యాసింజర్ డ్రైవర్ మదనపల్లి మండలం సీటీఎం (మదనపల్లి రోడ్డు) సమీపంలో రైలు పట్టాలపై మృతదేహం ఉందనే సమాచారం రైల్వే పోలీసులకు అందింది. దీంతో కదిరి రైల్వే పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ మహబూబ్ బాషా సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత రైలు కింద పడి మృతి చెంది ఉంటాడని ప్రాథమికంగా అంచనా వేశారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించక పోవడంతో గుర్తు తెలియని మృతదేహంగా నిర్ధారించారు. మృతదేహాన్ని 108 వాహనంలో మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. కాగా, రైలు కింద పడి గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందాడన్న వార్త సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం కావడంతో మృతుడి కుటుంబ సభ్యులు జిల్లా ఆస్పత్రికి చేరుకుని వృద్ధుడు భోజనపు రామచంద్ర(65)గా గుర్తించారు. స్వస్థలం వాల్మీకిపురం మండలం శివపురం కాగా, పదేళ్ల క్రితం పట్టణంలోని నీరుగట్టువారిపల్లె మారుతీనగర్‌లో స్థిరపడినట్లు చెప్పారు. మృతుడికి భార్య సుజాత, కుమారులు రమేష్‌బాబు, సుబ్రహ్మణ్యం, మల్లికార్జున, కుమార్తె దేవి ఉన్నారు. స్థానికంగా చిల్లర దుకాణం నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు.


వృద్ధుడి మృతదేహం

మృతుడికి మూర్ఛవ్యాధి కారణంగా అనారోగ్యానికి గురై చికిత్స పొందుతున్నాడని తెలిపారు. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లిపోయాడని తెలిపారు. అనారోగ్యంతో మనస్తాపం చెంది రామచంద్ర ఆత్మహత్య చేసుకున్నట్లుగా కుటుంబ సభ్యులు రైల్వే పోలీసులకు తెలిపారు.

అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య


ఆత్మహత్య చేసుకున్న ధనుంజయ

రాయచోటి టౌన్: అప్పుల బాధ తాళలేక ధనుంజయ (30) అనే వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. రాయచోటి పట్టణం రవిహాల్ సర్కిల్ దగ్గరగా ఉన్న శ్రీ రాముడి గుడి సమీపంలో ఒక ఇంటిలో అద్దెకు నివాసం ఉంటున్నాడు. బైకుపై పల్లెలకు వెళ్లి కుక్కర్లు, గ్యాస్ స్టౌవ్‌లు రిపేరు చేసుకొని జీవనం సాగించేవాడు. ఈ క్రమంలో అప్పులు చేశాడు. దీనికి తోడు వివాహం కాలేదు. ఈ నేపథ్యంలో బుధవారం ఉరి వేసుకున్నాడు. స్థానికులు గమనించి ఆస్పత్రికి తీసుకెళ్లారు. అయితే అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

మదనపల్లెలో కేంద్రీయ విద్యాలయం

- తాత్కాలిక భవన నిర్మాణాలపై సంతృప్తి వ్యక్తం చేసిన కేంద్ర బృందం
- వచ్చే విద్యాసంవత్సరంలో ప్రారంభానికి సన్నాహాలు


అధికారులకు సూచనలిస్తున్న డిప్యూటీ కమిషనర్ మంజునాథ్, ఆర్డీఓ హరిప్రసాద్

మదనపల్లె : మదనపల్లె వాసులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న కేంద్రీయ విద్యాలయం కల సాకారమవుతోంది. వచ్చే విద్యాసంవత్సరం నుంచి కేంద్రీయ విద్యాలయం ప్రారంభానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. అందులో భాగంగా బుధవారం కేంద్ర బృందం మదనపల్లెకు వచ్చి కేంద్రీయ విద్యాలయం తాత్కాలిక భవన నిర్మాణాలను పరిశీలించింది. కేంద్రీయ విద్యాలయం, బెంగళూరు డిప్యూటీ కమిషనర్ మంజునాథ్, తిరుపతి కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ అనూరాధలు ఆర్డీఓ హరిప్రసాద్‌తో కలిసి ఎం.ఎల్.ఎల్.ఆస్పత్రి వెనుకవైపున ఉన్న ఇంటిగ్రేటెడ్ ట్రైబల్ వెల్ఫేర్ హాస్టల్ ఆవరణలో రూ.50లక్షలకు పైగా ఖర్చుచేసి తాత్కాలికంగా నిర్మించిన కేంద్రీయ విద్యాలయ భవనాన్ని పరిశీలించారు. తరగతి గదులు, విద్యార్థులకు అవసరమైన వసతులు, ఇతర సౌకర్యాల కల్పనపై సంతృప్తి వ్యక్తం చేశారు. తరగతులు నిర్వహించేందుకు భవనం సిద్ధంగా ఉందని, అనుమతులపై ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామన్నారు. అనంతరం మండలంలోని వలసపల్లెలో కేంద్రీయ విద్యాలయానికి మదనపల్లె–చిత్తూరు జాతీయరహదారిపై హైవేకు ఆనుకుని రెవెన్యూ అధికారులు సిద్ధం చేసిన 6.9 ఎకరాల భూమిని పరిశీలించారు. కేంద్రీయ విద్యాలయ నిర్మాణానికి స్థలం అనువుగా, విశాలంగా ఉందన్నారు. క్షేత్రస్థాయిలో తాము పరిశీలించిన అంశాలన్నింటిపై నివేదిక తయారుచేసి కేంద్రప్రభుత్వానికి పంపుతామన్నారు. రానున్న విద్యాసంవత్సరం నుంచి తరగతులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల, తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీఓ భానుప్రసాద్, ఎంఈఓ ప్రభాకరరెడ్డి, పంచాయతీరాజ్ ఈఈ చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్ఐ రెడ్డెప్ప తదితరులు ఉన్నారు.

కానిస్టేబుల్‌ను ఢీకొట్టిన కేసులో ఇద్దరి అరెస్టు


కారు, ఎర్రచందనంతోపాటు నిందితుల అరెస్టు చూపుతున్న పోలీసులు

కేవీపల్లె : ఎర్రచందనం అక్రమంగా తరలిస్తూ కారుతో ఢీకొట్టి టాస్క్‌ఫోర్స్ కానిస్టేబుల్ బి. గణేష్ మృతికి కారణమైన కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు కలకడ, రాయచోటి రూరల్ సీఐలు శ్రీనివాసులు, తులసీరామ్, కేవీపల్లె ఎస్ఐ రహీముల్లా తెలిపారు. బుధవారం నిందితుల వివరాలు మీడియాకు వెల్లడించారు. టాస్క్‌ఫోర్స్ కానిస్టేబుల్‌ను ఢీకొట్టిన కేసులో తమిళనాడు రాష్ట్రం కల్లకుర్చి జిల్లా వల్లిమలై తాలూకా కిలకాడ్‌కు చెందిన వి.కుబేంద్రన్, కన్నూరుకు చెందిన ఎ. రమేష్‌లను అరెస్టు చేశామన్నారు. అలాగే కేఏ 02 ఎంజీ 2847 నెంబరు గల మారుతి స్విఫ్ట్ కారు, 8 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. స్వాధీనం చేసుకున్న 302 కేజీల బరువు ఉన్న ఎర్రచందనం, కారు విలువ సుమారు రూ. 15.10 లక్షలు ఉంటుందని తెలిపారు. పరారీలో ఉన్న నిందితుల కోసం విస్తృతంగా గాలింపు చర్యలు చేపడతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ కాలేషా, పీసీలు మస్తాన్, సునీల్, ఆదినారాయణ, ధన, మోహన, చంద్ర, రఘునాయక్, శివ, భాస్కర్, మురళి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ఫ్లెక్సీ తొలగింపుపై పోలీసులకు ఫిర్యాదు


ఎస్ఐ చిన్నపెద్దయ్యకు ఫిర్యాదు చేస్తున్న మారె సుకుమార్

ఓబులవారిపల్లె : ముక్కవారిపల్లె పంచాయతీ, గొల్లపల్లి గ్రామం, దళితవాడలో వైఎస్సార్‌సీపీ ఫ్లెక్సీ తొలగింపుపై పార్టీ నాయకులు మారె సుకుమార్ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి ఫొటోలు ఉన్న బ్యానర్‌ను గొల్లపల్లి దళితవాడ విద్యుత్ స్తంభానికి ఏర్పాటు చేశామన్నారు. కొందరు పెత్తందారులు ఫ్లెక్సీని తొలగించారన్నారు. దీంతో ఓబులవారిపల్లె ఎస్ఐ చిన్నపెద్దయ్యకు ఫిర్యాదు చేశామన్నారు.

ప్రతి పోలింగ్ బూత్ వద్ద కనీస సౌకర్యాలు ఉండాలి


గుడిబండ పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న జేసీ ఫర్మాన్ అహమ్మద్‌ఖాన్

కలకడ : ప్రతి పోలింగ్ బూత్ వద్ద కనీస సౌకర్యాలు ఉండాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహమ్మద్‌ఖాన్ ఆదేశించారు. బుధవారం మండలంలోని గుడిబండ, కోన, నడిమిచెర్ల పంచాయతీలలోని పోలింగ్ బూత్ నంబర్లు 44, 45, 46, 47, 48, 49, 50 లను తనిఖీ చేశారు. ఓటర్ల నమోదుకు అవకాశం ఉందని, తొలగింపునకు ఆధారాలు ఉండాలని సూచించారు. దారిలో చౌకబియ్యం పంపిణీ చేస్తున్న యండీయూ ఆపరేటర్లు ఎలా అందజేస్తున్నారు అని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందజేస్తున్న ఉచిత బియ్యం ప్రతి కార్డుదారునికి అందజేయాలన్నారు. ఎలాంటి ఫిర్యాదులు అందినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఎంఈఓ మునీంద్రనాయక్, ఏఈ రమణయ్య, వీఆర్ఓలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా బియ్యం నిల్వ ఉంచితే చర్యలు

రాయచోటి టౌన్ : బియ్యం వ్యాపారులు నిబంధనలను అతిక్రమించి నిల్వలు ఉంచితే కఠిన చర్యలు తప్పవని అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహమ్మద్‌ఖాన్ హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న టోకు, చిల్లర వర్తకులు, పెద్ద రిటైలర్లు, సూపర్ మార్కెట్, మిల్లర్లు తమ వద్ద ఉన్న పలు రకాల బియ్యం, ధాన్యం వివరాలను ఈనెల 10వ తేదీలోగా https.//evegoil/.nic.in పోర్టల్‌లో నమోదు చేసుకోవాలన్నారు. తాము ఆకస్మిక తనిఖీ నిర్వహించినప్పుడు నిబంధనలను అతిక్రమించి నిల్వలు కనిపిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

నిత్యావసరాల పంపిణీ పారదర్శకంగా ఉండాలి

సంబేపల్లె : ప్రజా పంపిణీ వ్యవస్థలో ఆంధ్రప్రదేశ్ వినూత్నంగా చేపట్టిన ఇంటింటికి బియ్యం పంపిణీ (మొబైల్ డిస్ట్రిబ్యూషన్ యూనిట్) వాహనాన్ని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. బుధవారం మండల పరిధిలోని నల్లగుమ్మ క్రాస్, దేవపట్లలో లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేస్తున్న సమయంలో వాహనాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో జాయింట్ కలెక్టర్ మాట్లాడారు. రేషన్ తూనికలను (కొలతలు) పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ కృపావతి, తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ మృతిపై పూర్తిస్థాయి విచారణ

రాజంపేట : జిల్లాలోని పీలేరు వద్ద టాస్క్‌ఫోర్స్ కానిస్టేబుల్‌ను కారుతో ఢీకొట్టి చంపిన సంఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరుగుతోందని జిల్లా అటవీశాఖాధికారి వివేక్ బుధవారం తెలిపారు. టాస్క్‌ఫోర్స్ కానిస్టేబుల్ గణేష్ మృతి లాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగిన విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సంఘటనను రాష్ట్ర అటవీశాఖ తరఫున తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. విధి నిర్వహణలో చనిపోయిన కానిస్టేబుల్ కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని , సానుభూతిని తెలియజేశారు.

ఆటో బోల్తా

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని డి.రామాపురం వద్ద బుధవారం ఆటో అదుపు తప్పి బోల్తాపడటంతో డ్రైవర్ బాదుల్లాకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. లక్కిరెడ్డిపల్లెకు చెందిన ఆటో డ్రైవర్ బాదుల్లా పగలంతా ఆటో తిప్పి సాయంత్రం తన భార్యతో కలిసి దప్పేపల్లె రామాపురం వద్ద ఉన్న మామిడి తోట వద్దకు వెళ్లాడు. తిరిగి లక్కిరెడ్డిపల్లెకు వస్తుండగా డి.రామాపురం క్రాస్‌వద్ద ఆటో అదుపు తప్పి బోల్తాపడటంతో తీవ్ర గాయాలయ్యాయి. ఆటోలో ఉన్న బాదుల్లా భార్య ఇంటికి ఫోన్ చేయడంతో బంధువులు కడప రిమ్స్‌కు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మదనపల్లె : ద్విచక్ర వాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడిన సంఘటన బుధవారం కురబలకోట మండలంలో జరిగింది. తంబళ్లపల్లి మండలం జుంజురుపేట పంచాయతీ కొత్త రెడ్డివారిపల్లెకు చెందిన రామస్వామి రెడ్డి కుమారుడు నిరంజన్ రెడ్డి (45), ద్విచక్ర వాహనంలో మదనపల్లికి వస్తుండగా మార్గమధ్యంలో కురబలకోట మండలం ఆర్సీ. కురవపల్లికి చెందిన శంకర కుమారుడు సి.రెడ్డెప్ప (25), లిఫ్ట్ అడిగాడు. ఇద్దరు కలిసి ద్విచక్ర వాహనంలో వస్తుండగా ముదివేడు – కడప క్రాస్ వద్ద కడప నుంచి మదనపల్లికి వస్తున్న ఆర్టీసీ బస్సు వీరి ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడగా స్థానికులు బాధితులను 108 వాహనంలో మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. నిరంజన్ రెడ్డి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు రెఫర్ చేశారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

మదనపల్లె : మండలంలోని రాష్ట్ర సరిహద్దు చీకిలబైలు చెక్‌పోస్టు వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా, కర్ణాటక రాష్ట్రం చింతామణి తాలూకా ఎర్రం రెడ్డి హళ్లికి చెందిన లక్ష్మన్న కుమారుడు శ్రీనివాస్(41), ఆర్టీసీ బస్సులో కర్ణాటక మద్యం తరలిస్తూ పట్టుబడినట్లు తెలిపారు. అతని వద్ద నుంచి 1744 రూపాయల విలువ గల మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు.

పెద్దమండ్యం : నాటుసారా స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ పి. వెంకటేష్ బుధవార సిబ్బందితో వెళ్లి దాడులు నిర్వహించినట్లు తెలిపారు. దాడుల్లో తండాకు చెందిన బుక్కే లక్ష్మీనాయక్ వద్ద 10 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

సారా విక్రేత అరెస్టు

నిమ్మనపల్లె : రెడ్డివారిపల్లె పంచాయతీ సోమానుపల్లె కాలనీలో సారా విక్రయిస్తున్న తుపాకుల శ్రీరాములును అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 20 లీటర్ల స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితునిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ లోకేష్‌రెడ్డి తెలిపారు.

నవశకం



వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. నెలల తరబడి ఆఫీసుల చుట్టూ తిరిగినా లభించని సర్టిఫికెట్లు నేడు జగనన్న సురక్ష ద్వారా సత్వరమే అందుతున్నాయి. దయనీయ స్థితిలో ఉన్న సర్కారు బడుల రూపురేఖలు నాడు–నేడుతో ఇప్పుడు పూర్తిగా మారిపోయాయి. సొంతంగా సెంటు స్థలం కొనే స్థోమత లేక.. అద్దె చెల్లించలేక అవస్థలు పడుతున్న పేదల సొంతింటి కల సాకారమవుతోంది. వెరసి పేదల బతుకులు బాగుపడ్డాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

–సాక్షి నెట్‌వర్క్

పిల్లల చదువుకు ఇబ్బంది లేదు



మాది మైదుకూరు మండలం, తువ్వపల్లె. వ్యవసాయ కూలీలం, నాకు నలుగురు పిల్లలు. పెద్దమ్మాయి హర్షిత ఇంటర్ చదువుతోంది. పెద్ద కుమారుడు విష్ణువర్ధన్ 9వ తరగతి చదువుతున్నాడు. రెండో అబ్బాయి భానుప్రకాష్ 8వ తరగతి చదువుతున్నాడు. రెండో అమ్మాయి శ్రీవల్లి మూడో తరగతి చదువుతోంది. భానుప్రకాష్ ఏడో తరగతిలో ఉండగా మొదటిసారి నాకు అమ్మ ఒడి కింద ఆర్థిక సాయం అందింది. తర్వాత శ్రీవల్లి రెండో తరగతిలో ఉండగా రెండో సారి అమ్మ ఒడి పథకం కింద సాయం అందుకున్నాను. నలుగురు పిల్లల చదువులకు ఆర్థికంగా ఎంతో ఇబ్బందిగా ఉండేది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమ్మ ఒడి కింద చేస్తున్న ఆర్థిక సహాయంతో పిల్లల చదువుకు ఇబ్బంది లేకుండా ఉంది. నాలాంటి ఎంతో మంది పేద కుటుంబాల వారికి జగనన్న అందిస్తున్న సాయం మరువలేనిది.

- కాలువపల్లె స్వాతి, తువ్వపల్లె, మైదుకూరు మండలం.

సొంతింటి కల నెరవేరింది


సొంతింటి కల నెరవేర్చుకున్నానంటున్న సిద్ద యోగమాంబ

నేను 12 ఏళ్ల క్రితం వీరబల్లికి వచ్చి స్థిరపడ్డాను. నాకంటూ సొంత ఇల్లు కూడా లేదు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత ఇల్లు లేని వారికి ఇల్లు ఇస్తున్నారనే విషయం తెలిసి దరఖాస్తు చేసుకున్నాను. ఇల్లు మంజూరు చేశారు. ఇల్లు నిర్మించుకున్నాను. సంతోషంగా ఉంది. నాలాంటి వారి సొంతింటి కలను నెరవేర్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రుణం తీర్చుకోలేనిది.

- సిద్దయోగమాంబ, వీరబల్లి

బండపల్లె టోల్‌ప్లాజా సిబ్బందిపై దాడి

రామాపురం : కర్నూలు –చిత్తూరు జాతీయ రహదారిలోని రామాపురం మండలం బండపల్లి టోల్‌ప్లాజా వద్ద మంగళవారం అర్ధరాత్రి విధులు నిర్వహిస్తున్న జాలా ప్రవీణ్‌పై దాడి జరిగింది. ఈ సంఘటనకు సంబంధించి ముగ్గురిపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వి.ఎల్.ప్రసాద్‌రెడ్డి తెలిపారు. లక్కిరెడ్డిపల్లె మండలం మద్దిరేవుల గ్రామానికి చెందిన జాలా ప్రవీణ్ రామాపురం మండలం బండపల్లె టోల్‌ప్లాజాలో విధులు నిర్వహిస్తున్నాడు. మంగళవారం అర్ధరాత్రి సమయంలో లక్కిరెడ్డిపల్లె మండలం పాలెం గొల్లపల్లికి చెందిన ఎంపీటీసీ భర్త శివశంకర్‌నాయుడు, మరో ముగ్గురితో ఇన్నోవా వాహనంలో రాయచోటి నుంచి కడప వైపు వెళ్తున్నాడు. టోల్‌ప్లాజా వద్ద సిబ్బంది టోల్ గేటును తీయలేదని అతనితో పాటు వచ్చిన అనుచరులు ముగ్గురు కలిసి ప్రవీణ్‌పై దాడి చేశారు. గాయపడిన వ్యక్తిని 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.